ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కరీంనగర్

5 జిల్లా వార్తలు

శుక్రవారం 2 మే 2025

కార్మికుల హక్కులను కాలరాస్తే బీజేపీ పతనం తప్పదు

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



బైక్‌ర్యాలీలో పాల్గొన్న చాడ వెంకట్‌రెడ్డి, టేకుమల్ల సమ్మయ్య, ఏఐటీయూసీ నాయకులు

భగత్‌నగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులు కాలరాస్తే బీజేపీ పతనం తప్పదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. మేడే సందర్భంగా కరీంనగర్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బహిరంగ సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు ప్రవేశపెట్టిందన్నారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే 20న జాతీయ సార్వత్రిక సమ్మెను కార్మిక వర్గం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మేడే దినోత్సవం సందర్భంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రైల్వే హమాలీ సంఘం కార్మికులు ఏర్పాటు చేసిన జెండాను, కూరగాయల మార్కెట్ వద్ద ఉల్లిగడ్డల హమాలీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండాను చాడ వెంకటరెడ్డి ఆవిష్కరించారు. బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన పతాకాన్ని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య ఆవిష్కరించారు. సిమెంట్ గోదాం, ఫర్టిలైజర్ హమాలీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండాలను ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్నయాదవ్ ఆవిష్కరించారు.

- **భారీ బైక్ ర్యాలీ**

కరీంనగర్‌లో మేడే వేడుకల్లో భాగంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రైల్వే కార్మికులు నిర్వహించిన బైక్ ర్యాలీలో చాడ వెంకటరెడ్డి స్వయంగా బైక్ నడుపుతూ కార్మికుల్లో ఉత్సాహం నింపారు. జెండా ఆవిష్కరణ అనంతరం రైల్వే గేట్ నుంచి సుభాష్‌నగర్, మంచిర్యాల చౌరస్తా, గాంధీరోడ్, రాజీవ్‌చౌక్, టవర్‌సర్కిల్, కూరగాయల మార్కెట్, కమాన్‌చౌరస్తా మీదుగా బద్దం ఎల్లారెడ్డి భవన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఎర్లీబర్డ్ స్కీంలో జమ్మికుంటకు ప్రథమస్థానం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మహమ్మద్ ఆయాజ్

జమ్మికుంట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎర్లీబర్డ్ స్కీంలో జమ్మికుంట మున్సిపాలిటీ ప్రథమ స్థానంలో నిలిచిందని కమిషనర్ మహమ్మద్ ఆయాజ్ తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఏప్రిల్ నెలలో ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించిన వారికి ప్రభుత్వం ఐదు శాతం రిబేట్ ప్రకటించిందన్నారు. రాష్ట్రంలోని 13 కార్పొరేషన్లు, 151 మున్సిపాలిటీల్లో జమ్మికుంట 1.89 కోట్లు (55.04శాతం) వసూలు చేసి మొదటి స్థానంలో నిలిచిందన్నారు. గతంలో ఆస్తి పన్ను వసూళ్లలో సైతం జమ్మికుంట రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించినట్లు గుర్తు చేశారు. తమ సిబ్బంది ఆస్తి పన్ను చెల్లిస్తే కలిగే లాభాలను పట్టణ ప్రజలకు వివరించారని, అందువల్లే రాష్ట్రంలోనే అందరి కన్నా ఆస్తి పన్ను ఎక్కువ వసూళ్లు చేయగలిగామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. మూడు కోట్లు కేటాయించిందన్నారు. సమావేశంలో మేనేజర్ రాజిరెడ్డి, ఆర్ఐ భాస్కర్ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ గడువు మూడు రోజులు పొడిగింపు

కరీంనగర్ టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) గడువును ప్రభుత్వం మూడు రోజులు పొడిగించింది. ఎల్ఆర్ఎస్ గడువు ఏప్రిల్ 30వ తేదీతో ముగియగా మే 3వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 14 వేల మంది ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు అర్హత కలిగిన దరఖాస్తుదారులుండగా ఇంత వరకు 1800 మంది మాత్రమే ఫీజు చెల్లించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి

ఎమ్మెల్యే ఆన్ వీల్స్

- ప్రారంభించిన మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ప్రత్యేక యాప్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ప్రజలు ఎమ్మెల్యేను కలవాలనుకుంటే నియోజకవర్గ కేంద్రంలో ఉండే ఆయన క్యాంపు కార్యాలయానికో ఆయన నివాస గృహానికో, జిల్లా కేంద్రానికో, అసెంబ్లీ జరిగే సమయాల్లో రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కో వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఇలాంటి పరిస్థితుల్లో సామాన్య ప్రజలు ఎమ్మెల్యేను కలవడానికి గ్రామంలోని చోటామోటా లీడర్‌నో, సర్పంచునో, మరో ఇతర నేతనో వెంట తీసుకొని వెళ్లడానికి సిద్ధమవుతారు. ఇది వ్యయ ప్రయాసలతో కూడుకున్నది. తీరా వెళ్లి ఎమ్మెల్యేను కలిస్తే తమ పని ఆరోజే అవుతుందో లేదో, ఎన్ని రోజులు అవుతుందో, ఎన్నిసార్లు వెళ్లాల్సి వస్తుందో ఎవరికి తెలియని పరిస్థితి.

దీంతో సామాన్య ప్రజలు అవసరాలను పక్కనబెట్టి ఎమ్మెల్యేను కలువకుండానే పైరవీకారులను ఆశ్రయించడం గ్రామాల్లో సర్వసాధారణం. ఈ సమస్యను దూరం చేయాలనుకున్నారు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ. ప్రజలు తనదగ్గరికి వచ్చి వ్యయప్రయాసలకు గురయ్యే బదులు తానే వారి వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకొని అక్కడికక్కడే కాకున్నా వీలైనంత త్వరలో ఆ సమస్యలు పరిష్కరించాలనుకున్నారు. అందుకు "ఎమ్మెల్యే ఆన్ వీల్స్" అనే కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించుకున్నారు. 25 లక్షలు వెచ్చించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనంలో గ్రామాలకు వెళ్లి ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకుంటున్నారు. ఎమ్మెల్యే వెంట ఆ వాహనంలో మండల, నియోజకవర్గ స్థాయి అధికారుల బృందం కూడా గ్రామాలకు వెళ్తుంది.

- **ఎమ్మెల్యే ఆన్ వీల్స్ యాప్**

సమస్యలను తెలుసుకోవడమే కాకుండా వాటిని పరిష్కరించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేలా ఎమ్మెల్యే ఆన్ వీల్స్ అనే యాప్‌ను తయారు చేయించి ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉంచారు. ఈ యాప్‌ను నియోజకవర్గంలోని 2.28 లక్షల మంది ఓటర్ల ఐడీకి అను సంధానం చేశారు. ఓటర్లు తమ సమస్యలను నేరుగా ఈ యాప్‌లో అప్‌లోడ్ (నమోదు) చేసుకుంటే వాటిని అధికార బృందం పరిశీలించి పరిష్కరిస్తుంది. ఎమ్మెల్యే గ్రామాలకు వెళ్లినప్పుడు ప్రజలు చేసే విన్నపాలను కూడా ఇందులో నమోదు చేసి వాటి పరిష్కారాలను, ఇతరత్రా సమాచారాన్ని నోటిఫికేషన్ల ద్వారా ఆయా ఫిర్యాదుదారులకు పంపిస్తారు. ప్రజలు తమ ఇంటి నుంచే తమ సమస్యను విన్నవించుకునే అవకాశం దాని స్టేటస్ తెలుసుకునే అవకాశం కల్పించే విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఎమ్మెల్యే ఆన్ వీల్స్ అనే యాప్‌ను డిజైన్ చేసి యాప్ స్టోర్‌లో అందుబాటులో ఉంచారు.

ప్రస్తుతానికి ఈ యాప్‌ను నియోజకవర్గంలో ఉన్న 2.28 లక్షల మంది ఓటర్ల ఐడీలతో అనుసంధానం చేశారు. ఓటర్లు నేరుగా వారి సమస్యను శాఖల వారిగా దీనిలో నమోదు చేయవచ్చు. తెల్లకాగితంపై సమస్యను రాసి దానిని ఫొటో తీసి పెట్టినా ఫిర్యాదు నమోదవుతుంది. అధికారులు కూడా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని తమశాఖకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకుంటారు. ఫిర్యాదుల స్టేటస్ పరిష్కారమైతే అయ్యిందని, లేకుంటే వేరేమైనా సమస్యలుంటే వాటిని కూడా నోటిఫికేషన్ల ద్వారా నేరుగా వారి సెల్‌ఫోన్‌కే సమాచారం వెళ్తుంది.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

- **ఎమ్మెల్యే ఆన్ వీల్స్ వాహనంలో..**

ఎమ్మెల్యే ఆన్ వీల్స్ వాహనంలో రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖల అధికారులకు అవసరమైన సామగ్రి ఏర్పాటు చేశారు. ఈ వాహనంలోనే కొన్ని ముఖ్యమైన పరిపాలనా కార్యకలాపాలను నిర్వహించేందుకు సిద్ధం చేయించారు. ఈ వాహనంలో ఎమ్మెల్యేతో పాటు ఇంకో ముగ్గురు కూర్చోవచ్చు. రెండు కంప్యూటర్లు, ఆపరేటర్లు వాహనంలో ఉంటారు.



నుస్తులాపూర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

- **మొదటి రోజు..**

ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు నుస్తులాపూర్‌లో 50 వరకు వివిధ సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఇందులో 70 శాతం వరకు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించినట్లు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, భూ సమస్యలు, ఎల్‌వోసీ, గృహ నిర్మాణ శాఖ, పోలీసు శాఖ, రేషన్‌కార్డు వంటి సమస్యలపై ప్రజలు అర్జీలు పెట్టుకున్నారు. ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వెంట స్థానిక తహసీల్దార్, పోలీసు అధికారి, డాక్టర్, పంచాయతీరాజ్‌శాఖ, తదితర ప్రభుత్వశాఖల అధికారులు అందుబాటులో ఉండడంతో చిన్న చిన్న సమస్యలను అక్కడే పరిష్కరించారు. ఇతర సమస్యలపై ఫోన్ ద్వారా సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు.

వారానికి మూడు రోజులు గ్రామాలకు 'ఎమ్మెల్యే ఆన్ వీల్స్'

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్: వారానికి మూడు రోజులు ఎమ్మెల్యే ఆన్ వీల్స్ వాహనంలో అధికారుల బృందంతో ఆయా గ్రామాలకు వెళ్లి ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని మానకొండూర్ మిగతా 8వ పేజీలో

ఫెయిల్ అయిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

కరీంనగర్, మే 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పదో తరగతిలో ఫెయిల్ అయిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మండల విద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన 6,200 మంది విద్యార్థుల్లో 5,995 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. ఫెయిల్ అయిన 205 మంది విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వచ్చే నెలలో జరగనున్న సప్లిమెంటరీ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. 2015 నుంచి ఇప్పటి వరకు పదో తరగతిలో సబ్జెక్టుల వారీగా ఫెయిల్ అయిన విద్యార్థుల డాటా సేకరించాలన్నారు. ఇప్పటి వరకు ఉత్తీర్ణత సాధించలేని, పరీక్ష ఫీజు చెల్లించకుండా ఉండిపోయిన వారి వివరాలు సేకరించాలన్నారు. వారం దరితో పరీక్ష ఫీజు చెల్లించేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని సూచించారు. ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీలు భవిత కేంద్రాలను తక్కువ విద్యార్థులు ఉండి గదులు ఖాళీగా ఉన్న పాఠశాలల్లోకి మార్చాలన్నారు. వీలైనన్ని అంగన్‌వాడీలను ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఈవో జనార్దన్‌రావు, కో-ఆర్డినేటర్లు మిల్కూరి శ్రీనివాస్, ఆంజనేయులు, డీఈడీవో కృపారాణి, సీడీపీవోలు సబిత, శ్రీమతి పాల్గొన్నారు.



విద్యాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టర్‌ను అభినందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

జిల్లాలో 2024-25 యాసంగి సీజన్‌లో సమస్యలు లేకుండా ధాన్యం సేకరణ చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి,జిల్లా అధికారులను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అభినందించారు. జిల్లాలో యాసంగి సీజన్ 2024-25లో 99,408 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం, 14,344 మంది రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఇందులో దొడ్డు రకాలు 90,632 మెట్రిక్ టన్నులు, సన్న రకాలు 8,756 మెట్రిక్ టన్నులు. వీటికి సంబంధించిన 100.54 కోట్ల రూపాయలు రైతుల బ్యాంక్ అకౌంట్లలో జమ చేశారు. సన్న రకాల వడ్లకు బోనస్ 4.38 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమచేయడానికి ప్రతిపాదనలు పంపించారు.

ప్రైవేటు ఆసుపత్రులు నిబంధనలు పాటించాలి

సుభాష్‌నగర్: ప్రైవేటు ఆసుపత్రులు నిబంధనలు తప్పక పాటించాలని కలెక్టర్ పమేలాసత్పతి అన్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు సంబంధించిన జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రభుత్వం నిర్వహించే ఆరోగ్య మహిళ ఉచిత వైద్య పరీక్షల బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ ప్రతి ప్రైవేటు ఆసుపత్రికి పార్కింగ్ సౌకర్యం ఉండాలన్నారు. అత్యవసరంగా పార్కింగ్ చేయాల్సి వచ్చే వాహనాలకు సెక్యూరిటీని నియమించుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, ఐఎంఏ కరీంనగర్ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్, హెచ్‌ఈవో బాలయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఏఎంఎస్ డాక్టర్లకు బ్రిడ్జి కోర్సు శిక్షణ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

సుభాష్‌నగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో బీఏఎంఎస్ డాక్టర్లకు బ్రిడ్జి కోర్సును డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ గురువారం ప్రారంభించి మాట్లాడారు. శిక్షణ అనంతరం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న బీఏఎంఎస్ ఎంఎల్‌హెచ్‌పీలకు విడతల వారీగా శిక్షణ ఇస్తామని తెలిపారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, పీవోఎంసీహెచ్ డాక్టర్ సనజవేరియా, కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ నవీన, ఎన్‌హెచ్‌ఎం డీపీవో స్వామి పాల్గొన్నారు.

డీసీఈబీ కాంప్లెక్స్‌లో షాపులకు టెండర్లు

కరీంనగర్ టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ పరిధిలోని డీసీఈబీ కాంప్లెక్స్‌లోని షాపుల కోసం ఓపెన్ టెండర్ ప్రక్రియను అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ గురువారం నిర్వహించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఓపెన్ టెండర్ ప్రక్రియను నిర్వహించారు. ఐదు సంవత్సరాల పాటు అద్దె కేటాయింపు కోసం ఈ టెండర్లు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు, డీసీఈబీ కార్యదర్శి స్వదేశీకుమార్, జిల్లా సైన్స్ అధికారి జయపాల్‌రెడ్డి, ప్రణాళిక సమన్వయ కర్త ఎ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సమ్మర్ అలవెన్స్ ఏది?

- 2022 సంవత్సరం వరకే కేటాయింపు
- 2023 నుంచి ఎత్తివేసిన ప్రభుత్వం
- పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కరువు



భగత్‌నగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఎండలో పని చేస్తున్న తమకు సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని ఉపాధి హామీ కూలీలు డిమాండ్ చేస్తున్నారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు వేసవిని దృష్టిలో ఉంచుకుని మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ప్రత్యేకంగా సమ్మర్ అలవెన్స్‌ను గతంలో ప్రభుత్వం చెల్లించేది. 2022 వరకు చెల్లించిన ప్రభుత్వం 2023 నుంచి ఎత్తివేసింది. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామి కూలీలకు మార్చిలో 30 శాతం, ఏప్రిల్‌లో 35 శాతం, మేలో 40 శాతం సమ్మర్ అలవెన్స్‌లను కేటాయించాలని ఉపాధి హామీ కూలీలు కోరుతున్నారు. తాగురు నీడ, సౌకర్యాలు కల్పిస్తు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీతోపాటు దూర ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు కల్పించి, కొలతలు లేకుండా పని కల్పించాలని కూలీలు కోరుతున్నారు. పనిదినాలు పెంచి పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

- **సమ్మర్ అలవెన్స్ అందించాలి**

కొయ్యడ సృజన్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి



గతంలో ఉపాధి హామీ కూలీలకు కేటాయించిన విధంగా సమ్మర్ అలవెన్స్‌లను ప్రభుత్వం కూలీలకు అందించాలి. ఎండల తీవ్రత పెరిగిపోతున్నందున ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి. కూలీలకు రావాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే విడు దల చేయడంతోపాటు, పనిదినాలు పెంచాలి.

గోదాంకు నిప్పంటించిన గుర్తుతెలియని వ్యక్తులు

● టెంట్లు, డెకోరేషన్ సామగ్రి దగ్ధం

● రూ.10లక్షలు వరకు నష్టం



కాలిపోయిన సీలింగ్ టెంట్లు, డెకోరేషన్ సామగ్రి


ధర్మపురి, మే 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని పెద్దనక్కలపేటకు వెళ్లే దారిలో ఉన్న ఎండీ షబ్బీర్ గోదాంకు గుర్తుతెలియని వ్యక్తులు గురువారం తెల్లవారుజామున నిప్పంటించారు. దీంతో గోదాంలో నిల్వ ఉంచిన టెంట్ హౌస్‌కు చెందిన టెంట్లు, సీలింగ్స్, డెకోరేషన్ సామగ్రి పూర్తిగా కాలిపోయింది. రూ 10 లక్షలు పైగా భారీ నష్టం వాటిల్లింది, వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక రహమత్‌పురాకు చెందిన ఎండీ షబ్బీర్ పెద్దనక్కలపేట వెళ్లే దారిలో గోదాం గురించి ఒక గది కిరాయి తీసుకుని టెంట్ హౌస్‌కు సంబంధించిన టెంట్లు, సీలింగ్స్, డెకోరేషన్ సామాగ్రీ కిరాయి ఇవ్వడం కోసం నిల్వ ఉంచారు. తెల్లవారుఝామున గోదాం ఎదురుగా కిరాణం షాపు నడుపుతున్న పోలవేని తిరుపతి సుమారు 3 గంటల సమయంలో నిద్ర లేచి చూసే సరికి టెంట్ హౌస్ గోదాం కాలిపోతుందని ఫోన్ చేసి షబ్బీర్‌కు తెలిపాడు. వెంటనే షబ్బీర్ అక్కడికి చేరుకుని ఫైర్ ఇంజన్‌కు ఫోన్ చేసి తెప్పించి మంటలను ఆర్పివేయించారు. గోదాంలో భద్రపరిచిన టెంట్లు, సీలింగ్ టెంట్లు (150), డెకోరేషన్, ప్లాస్టిక్ సామగ్రీ కాలి బూడిద అయ్యింది. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ సందర్శించి వివరాలు సేకరించారు. బాధితుడు ఎండీ షబ్బీర్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అబ్దుల్ కలాం విగ్రహంపై పట్టింపేది?

తిమ్మాపూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం విగ్రహం గుర్తుపట్టరాని విధంగా ధ్వంసమైంది. నిత్యం పాఠశాలలో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్న ఉపాధ్యాయులు సైతం కలాం విగ్రహాన్ని పట్టించుకోకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు కూడా పాఠశాల ఆవరణలోనే జరుగుతున్నా విగ్రహం వైపు కన్నెత్తిచూడకపోవడం శోచనీయం. పాఠశాల పరిసరాలు రాత్రయితే మందుబాబులకు అడ్డాగా మారుతాయి. దీంతో వారే విగ్రహం ధ్వంసం చేశారా.. లేదా ఇంకెవ రైనా చేశారా అనేది తెలియని పరిస్థితి. ఏది ఏమైనా స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, అధికారులు సైతం అబ్దుల్‌కలాం విగ్రహం పట్టించుకోకపోవడం చాలా బాధాకరమని అని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి అబ్దుల్ కలాం విగ్రహానికి మరమ్మతులు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



గుర్తుపట్టరాని విధంగా ఉన్న అబ్దుల్ కలాం విగ్రహం



పని గంటలు లేని నేతన్నలు

ప్రభుత్వ ఆర్డర్లతో నేతన్నలకు భరోసా..

సిరిసిల్లలో 30 వేల మరమగ్గాలు...

వస్త్ర పరిశ్రమలో 20 వేల మంది కార్మికులు, గార్మెంట్ రంగంలో 5 వేల మందికి ఉపాధి

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

మరమగ్గాలే వాళ్లకు లోకం. నిత్యం నేత పనిలోనే జీవితం. కానీ 8 గంటలకు బదులు 12 గంటలు ఉపాధి కోసం మరమగ్గాల చప్పుళ్ల మధ్య నలిగిపోతున్నారు. కూలి ఒప్పందాల సమయంలో కార్మికులకు 8 గంటల పనివిధానం అమలు చేస్తామని యాజమాన్యాలు రాసుకున్న ఒప్పందాలు అమలులోకి రాకుండానే పోయాయి. పని గంటల పరిమితి కోసం సాగిన పోరాటంలో కార్మికుల రక్తంతో తడిసి ఎగిరిన ఎర్రజెండాతోనే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ కార్మికులు ఉపాధికోసం గత ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరలు, ఇతర ప్రభుత్వ ఆర్డర్లను సాధించారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రభుత్వ ఆర్డర్లకు ఇబ్బందులు ఏర్పడిన సందర్భంలోనూ కార్మికులు మళ్లీ రోడ్డెక్కడంతో ప్రభుతం బతుకమ్మ చీరల స్థానంలో స్వశక్తి మహిళలకు చీరలు ఇతర ఆర్డర్లను ఇచ్చి భరోసాను నింపింది. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా 30వేల మరమగ్గాలు, డైయింగ్‌లు, సైజింగ్‌లు, వార్పిన్‌లపై 15 వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న నేతన్న పథకాల పై ఎంతో అశగా నేత కుటుంబాలు ఉన్నాయి. మరోవైపు పని గంటల పరిమితి లేకపోవడంతోనే మానసికంగా, ఆరోగ్య పరంగా ఇబ్బందులు పడుతున్నారు. కార్మిక సంఘాలు 8 గంటల పనివిధానం అమలుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూనే ఉన్నాయి.

● నిత్యం బతుకు పోరాటం..

సిరిసిల్ల మగ్గం బతుకులు ఎప్పుడూ ఆగమాగమే. నిత్యం బతుకు పోరాటంగానే సాగుతుంది. పొద్దస్తమానం కష్టపడినా నేతన్నలు ఉపాధి కరువై అప్పుల్లో కూరుకుపోతూనే ఉన్నారు. పడుగు పోగులు, ఉరితాళ్లుగా వేలాడుతుంటే నిత్యం బతుకు చప్పుళ్ల



వినిపించిన మరమగ్గాలు ఎప్పుడూ నేతన్నలు వెక్కిరిస్తూనే ఉంటాయి. ఈక్రమంలో నేతన్నలకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వ ఆర్డర్లు భరోసా కల్పిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో అందిన ఆర్డర్లలో మార్పులు తీసుకవచ్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డర్లు ఇవ్వడంలో చేసిన జాప్యం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఒక్కసారిగా సంక్షోభంలోకి వెళ్లింది. దాదాపు 15 మందికి పైగా కార్మికులు ఉరి పోసుకున్నారు. వామపక్ష పార్టీలు, పవర్‌లూం కార్మిక సంఘాలు, వస్త్రోత్పత్తి దారుల సంఘాల ఆందోళనల ఫలితంగా ప్రభుత్వం మళ్లీ స్వశక్తి మహిళల కోసం చీరల ఆర్డర్లు, విద్యార్థులకు యూనిఫాం బట్ట ఉత్పత్తి వంటివి ఇవ్వడంతో ఉపశమనం పొందారు. విద్యుత్ రాయితీ పది హెచ్‌పీల నుంచి 25 హెచ్‌పీలకు పెంచారు. కొంత బకాయిల సమస్య వెంటాడుతుంది. స్వశక్తి చీరలకు రూ.50 కోట్లతో ఏర్పాటు చేసిన యారన్ డిపో ఆధారంగా నిలిచింది.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ నేపథ్యంలో గత ప్రభుత్వ హయాంలో సిరిసిల్లలో బీడీలు చుట్టే కార్మికులు, వస్త్రోత్పత్తి రంగంలో ఉన్న మహిళలకు గార్మెంట్ రంగంలో ఉపాధి కల్పించడానికి పూనుకుంది. ఆ దిశగానే సిరిసిల్ల శివారులోని సర్దాపూర్- పెద్దూర్‌ల వద్ద మహిళల కోసం గార్మెంట్ రంగంలో పరిశ్రమలు తీసుకవచ్చే దిశగా అపెరల్ పార్కు, పవర్‌లూం కార్మికులను యజమానులుగా మార్చే వర్కర్ టు ఓనర్ పథకం కోసం వీవింగ్ పార్కు, నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. అపెరల్ పార్కులో వస్తున్న యూనిట్లతో మహిళలకు ఉపాధి లభిస్తుండగా వర్కర్ టు ఓనర్ పథకం కోసం నేతన్నలు ఎదురుచూస్తూ నిరాశ చెందుతున్నారు. గత ప్రభుత్వం చేపట్టిన వర్కర్ టు ఓనర్ పథకంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకోకపోవడం, నిర్మాణం పూర్తిచేసుకున్న షెడ్లలో ఇతర సంస్థలకు లీజుకు ఇవ్వడంతో పవర్‌లూం కార్మికుల్లో పథకంపై ఆశలు సన్నగిల్లాయి. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం రూ.386.88 కోట్లతో పవర్‌లూం కార్మికులను యజమానులుగా మార్చే పథకాన్ని అమలుచేయడానికి సన్నాహాలు ప్రారంభించడంతో కార్మికుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. కానీ యాక్షన్ ప్లాన్ ఎంటో కనిపించకపోవడంతో ఎదురుచూపులే మిగిలిస్తున్నాయి.

గార్మెంట్ రంగంలో మహిళా కార్మికులకు ఉపాధి..

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభం నేపథ్యంలో సిరిసిల్ల పెద్దూర్ శివారులో మహిళా కార్మికుల కోసం 60 ఎకరాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ రూ.174 కోట్లతో నిర్మాణాలు చేపట్టారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్లాట్లను కేటాయించారు. అపెరల్ పార్కులో గార్మెంట్ రంగంలో మహిళలకు ఉపాధి లభిస్తుంది. అపెరల్ పార్కులో 2021 ఏప్రిల్‌లో గోకుల్‌దాస్ ఇమేజ్ గార్మెంట్ సంస్థ యూనిట్‌ను ప్రారంభించింది. 800 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తూ ప్రారం భించిన యూనిట్‌ను 1600 మందికి ఉపాధి కల్పించే దిశగా విస్తరించింది. సిరిసిల్ల నుంచి నేరుగా అమెరికా లాంటి దేశాలకు రేడిమేడ్ వస్త్రాలు ఎగుమతి చేస్తుంది. ఇదేదిశగా బెంగు ళూరుకు చెందిన అంత ర్జాతీయ గార్మెంట్ రంగసంస్థ టెక్స్‌పోర్టు కంపెనీ యూనిట్‌ను ప్రారంభించింది. ఈ కంపెనీ ద్వారా 2వేల మందికి ఉపాధి లభించనుంది.



● 'వర్కర్ టు ఓనర్'కు రూపకల్పన

మరమగ్గాల కార్మికులను యజమానులుగా మార్చే దిశగా వర్కర్ టు ఓనర్ పథకాన్ని రూపకల్పన చేశారు. ఇందుకు అనుగుణంగా జిల్లా కేంద్రం శివారులోని పెద్దూరు వద్ద వీవింగ్ పార్కు నిర్మాణం చేపట్టారు. 42 వీవింగ్ షెడ్లు నిర్మాణం జరిగింది. ఇందులో కార్మికులకు మొదటి విడతలో 4416 మరమగ్గాలను గ్రూప్ షెడ్ల కింద అందించనున్నారు. ఒక్కో కార్మికుడికి 800 చదరపు అడుగుల్లో స్టోర్ రూంతో కలిపి అందిస్తారు. ఇందులో నాలుగు సెమీ ఆటోమేటిక్ మరమగ్గాలు, కండెలు చుట్టే యంత్రం, ఇస్తారు. పార్కులో 60 వార్పిన్ మిషన్లు కూడా ఏర్పాటు చేస్తారు. ఒక్కో యూనిట్ ధర రూ.8 లక్షలుగా ముందుగా నిర్ణయించారు.

ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.16.52 లక్షల వరకు చేరుకునే అవకాశం ఉంది. ఇందులో 10 శాతం లబ్ధిదారుడి వాటాధనం, 50 శాతం ప్రభుత్వ రాయితీ, 40 శాతం బ్యాంక్ రుణం ఉండే విధంగా పథకానికి రూపకల్పన చేశారు. సిరిసిల్లలో ఎక్కడా లేని విధంగా ఏర్పాటు చేస్తున్న వీవింగ్ పార్కులో కొందరికే మరమగ్గాల యూనిట్లు దక్కే అవకాశం ఉండడంతో మిగతా కార్మికులు నిరాశకు గురయ్యే అవకాశం ఉంది. సిరిసిల్ల వస్త్రోత్పత్తి రంగంలో జియోట్యాగింగ్ చేసిన మరమగ్గాలు 30,352 ఉన్నాయి. వీటిపై 6,500 మంది పని చేస్తున్నారు. అనుబంధ పరిశ్రమల్లో మరో 6 వేల మంది వరకు పనిచేస్తున్నారు. ప్రభుత్వం మొదటి దశలో కేవలం 1,104 మందికే యూనిట్లను అందించడంతో మిగతా కార్మికులు నిరీక్షించే పరిస్థితి ఉంది.

జ్వరంతో మహిళ మృతి



కనకలక్ష్మి(ఫైల్)

ఓదెల, మే 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన నాగపూరి కనకలక్ష్మీ(70) అనేమహిళ గురువారం జ్వరంతో మృతి చెందింది. మృతురాలి కుమారుడు వెంకటేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గతవారం ఇంటివద్దనే కనకలక్ష్మికి మెదడు వాపుతోపాటు తీవ్రమైన జ్వరం రావడంతో అస్వస్థతకుగురైంది. వెంటనే కరీంనగర్‌లోని ఓప్రైవేట్‌ఆస్పత్రికి ఆసుపత్రికి తరలించారు. అక్కడివైద్యుల సూచన మేరకు వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తుండగాగురువారం మృతిచెందింది.

ఉప్పుమడుగు సహకార సంఘం కార్యదర్శిపై వేటు

జగిత్యాల, మే 1 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రాయికల్ మండలం ఉప్పుమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘం కార్యదర్శి తిరుపతిని సస్పెండ్ చేస్తూ జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు సంఘ పాలకవర్గానికి ఆయన ఆదేశాలు జారీచేశారు. ఉప్పుమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కనీససౌకర్యాలు కల్పించకపోవడంతోపాటు ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి హమాలీలను ఏర్పాటు చేయకపోవడంతో వీరాపూర్ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వీరాపూర్ ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్, రాయికల్ తహసీల్దార్ ఖయ్యూం, డీటీ గణేష్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయి కుమార్‌లు గురువారం సందర్శించి ధాన్యం కొనుగోళ్లు చేపడుతామని తెలిపారు.

షాపులోకి దూసుకెళ్లిన కారు..

● ధ్వంసమైన సామగ్రి

వేములవాడ టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి గ్రామంలో రోడ్డుపక్కన షాపులోకి కారు దూసుకువెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి గ్రామంలోని కరీంనగర్-వేములవాడ ప్రధాన రహదారి పక్కన ఉన్న షాపులోకి కారు వేగంగా వచ్చి దూసుకెళ్లింది. దీంతో షాపులో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. షాపులోని సామగ్రి ధ్వంసమయ్యాయి. కారుడ్రైవర్‌కు స్వల్పగాయాలైనట్లు గ్రామస్థులు తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



సంపత్ (ఫైల్)

ఎలిగేడు, మే 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బోనగిరి సంపత్(29) అనే యువకుడు మద్యానికి బానిసై ఉరి వేసుకొని మృతిచెందినట్లు జూలపల్లి ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం మద్యానికి బానిసై రోజూ మద్యం సేవిస్తుండగా భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. తాగుడు మానుకోకుంటే ఉండనని అతడిభార్య పుట్టింటికివెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన సంపత్ మద్యంతాగి బుధవారంరాత్రి ఇంటి డాబాపై పడుకుంటానని చెప్పివెళ్లాడు. గురువారం తెల్లవారుజామున మృతుడితల్లి వెళ్లి చూసేసరికి డాబామీద బట్టలు ఆరవేసుకునే తీగకు ఉరివేసుకొని కనిపించాడు. మృతుడి తల్లి లక్ష్మిఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వడదెబ్బతో హమాలీ మృతి

మంథని, మే 1 (ఆంధ్రజ్యోతి): మంథని మున్సిపాలిటీపరిధిలోని గంగాపురి గ్రామంలో వడదెబ్బతో పులి మణి(55) అనేహమాలీ గురువారం మృతిచెందాడు. ఉదయం గంగాపురిలోని ధాన్యం కొనుగోలు కేంద్రానికి హమాలీ పనికి వెళ్లి ఎండలో పనిచేయడంతో ఇంటికి వచ్చిన తర్వాత అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతన్ని చికిత్సకోసం మంథనిలోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి గోదావరిఖని ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, కుమా రుడు, కూతురు ఉన్నారు.

కుల బహిష్కరణ: కేసు నమోదు

ముస్తాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకోడ్ గ్రామంలో ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు కుల బహిష్కరణ కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. గ్రామానికి చెందిన వల్లపు గుట్టయ్యకు చెందిన భూమి పంచాయతీ విషయంలో కుల సంఘం చెప్పినట్లుగా గుట్టయ్య వినడం లేదని దీంతో అతన్ని బూతులు తిడుతూ కుల బహిష్కరణ చేశారన్న ఫిర్యాదు మేరకు సంఘం సభ్యుల మీద కేసు నమోదు చిసినట్లు ఎస్సై తెలిపారు.

సార్వత్రిక సమ్మెలో కార్మికులందరూ భాగస్వాములు కావాలి

● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్

సిరిసిల్ల రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈనెల20న చేపట్టే సార్వత్రికసమ్మెలో కార్మికులందరు భాగస్వాములు కావాలని, మేడే స్ఫూర్తితో కార్మికుల హక్కుల కోసం పోరాడుదామని సీఐటీయూ రాష్ట్రకార్యదర్శి కూరపాటి రమేష్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని సీఐటీయూ జిలా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ కార్మిక దినోత్సవం 139వ మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని లేబర్‌అడ్డా, రైతుబజార్, మున్సిపల్ కార్యాలయం, జిల్లాఆసుపత్రి, నేహ్రూనగర్, చంద్రంపేట, గణేష్‌నగర్, బీవై నగర్ ఏరియాలల్లో సీఐటీయూ జెండాలను ఆవిష్కరణ చేపట్టారు. అనంతరం బీవైనగర్‌లో చేపట్టిన బహిరంగ సభలో మేడే అమరవీరుల చిత్రపటాలకు ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ మేడే అమరవీరులు సాధించిన హక్కులను నేటి కేంద్ర బీజేపీ సర్కార్ హరించి వేస్తుందని ఆ హక్కుల రక్షణ కోసం మే20న జరుగు సార్వత్రికసమ్మెలో అన్నిరంగాల కార్మికులు, కష్టజీవులు భాగస్వాములుకావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికులు ఉదయం 10గంటలకు పనికి వెళ్లి సాయంత్రం 6గంటలకు ఇంటికి వస్తున్నారంటే కారణం నాడు మేడే కార్మికులు చిందించిన రక్తం నేనని అన్నారు. అందులో అధికారంలో ఉన్న బీజేపీ కార్మికులు పోరాడి సాధించుకుంటున్న ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచుతూ కార్పొరేట్ దిగ్గజాలకు కార్మికుల కష్టార్జితాన్ని దోచిపెడుతున్నారని విమర్శించారు. 29 కార్మిక చట్టాలను నరేంద్ర మోదీ సర్కారు ఒక కలం పోటుతో రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందని విమర్శించారు. అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం పీఎఫ్ ఈఎస్‌ఐ వంటి కనీస హక్కులు కూడా లేవన్నారు. బీజేపీపాలిత రాష్ట్రం ఉత్తర ప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ సర్కార్ 8 గంటల పని విధానాన్ని 10 గంటలకు పెంచిందన్నారు. మే20న దేశవ్యాప్తంగా కార్మిక వర్గం చేస్తున్న సమ్మెతో మోదీ మెడలు వంచి కార్మికవర్గ ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, కార్యదర్శి కోడం రమణ, మూషం రమేష్, అన్నల్‌దాస్ గణేష్, సూరం పద్మ, మిట్టపల్లి రాజమల్లు, రాపెల్లి రమేష్, నక్క దేవదాస్, సిరిమల్ల సత్యం, కుమ్మరికుంట కిషన్, గుండు రమేష్, కుడిక్యాల కనకయ్య , బెజుగం సురేష్, ఎక్కల్‌దేవి జగదీశ్, ఉడుత రవి, బాస శ్రీధర్, స్వర్గం శేఖర్, సుల్తాన్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో సీఐటీయూ బహిరంగ సభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రమేష్

రీల్స్ చేస్తూ నీటిలో మునిగి యువకుడి మృతి



మహ్మద్ అర్బాస్(ఫైల్)

కరీంనగర్ క్రైం, మే 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌కు చెందిన మహ్మద్ అర్బాస్(20) అనే యువకుడు రీల్స్ చేస్తుండగా ప్రమాదవశాత్తు వాగునీటిలో మునిగి గురువారం మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఇద్దరు స్నేహితులతో కలిసి అర్బాస్ నగర శివారులోని మానేరువాగు నీటిలోకి దిగి రీల్స్ వీడియో తీసుకుంటున్నారు. ఆ సమయంలో మరింత లోతుకు వెళ్లిన అర్బాస్ ప్రమాదవశాత్తుగా నీటిలోపడి మునిగిపోయాడు. స్థానికుల సహాయంతో అర్బాస్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మూడు రోజులుగా చెట్ల పొదల్లో వృద్ధురాలు

● గమనించి అధికారులకు సమాచారం ఇచ్చిన యువకులు ● సఖి కేంద్రానికి తరలింపు



వృద్ధురాలిని సఖి కేంద్రానికి తరలిస్తున్న డీడబ్ల్యూవో నరేష్, స్థానిక యువకులు

గొల్లపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం మల్లన్నపేట-శంకర్రావుపేట గ్రామరెవెన్యూ పరిధిలోని సాంబశివునిబోరులో దారుణం చోటుచేసుకుంది. హృదయవిదారకమైనస్థితిలో ఓ వృద్ధురాలిని చెట్ల పొదల్లో వదిలివెళ్లడంతో మూడురోజులుగా అచేతన స్థితిలో చావుబతుకుల మధ్య కొట్టాడుమిట్టాడింది. అటువైపువెళ్లిన యువకులు వృద్ధురాలి దీనస్థితిని గమనించి జిల్లా సంక్షేమశాఖ అధికారులకు సమాచారం అందించారు. జిల్లా సంక్షేమశాఖ అధికారి బోనగిరి నరేష్ హుటాహుటిన సంఘటనస్థలికి వచ్చి వృద్ధురాలిని సఖికేంద్రానికి తరలించిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. స్థానికయువకులు, సంక్షేమశాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇస్లాంపురాకు చెందిన వేల్పుల బూదవ్వ అనే వృద్ధురాలు మూడురోజుల క్రితం గొల్లపల్లి మండలం శ్రీరా ములపల్లె గ్రామంలోని ఐకేపీకేంద్రం వద్ద రాత్రి పొద్దు పోయాక ఒంటరిగా నడవలేనిస్థితిలో ఓ చోట అచేతన స్థితిలో పడిఉంది. గమనించిన స్థానిక యువకుడు ఎనుగుల మహేష్ ఆమె వద్ద ఉన్న ఆధార్ కార్డులోని ఫోన్‌నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారమందించాడు. వృద్ధురాలికి ఉన్న ఒక్కగానొక్క కూతురు ఫోన్‌ఎత్తి మాకేం సంబంధం లేదంటూ ఫోన్ కట్‌చేసింది. మూడురోజుల అనంతరం శంకర్రావుపేట-మల్లన్నపేట గ్రామాల రెవెన్యూ సరిహద్దులోని సాంబశివుని గుట్టకు ఉన్న చెట్లపొదల మధ్య దీనస్థితిలో పడి ఉండడాన్ని కొందరు అటుగా వెళ్లిన యువకులు గమనించి శ్రీరాములపల్లెకు చెందిన బీఆర్‌ఎస్ యువనాయకులు సల్లూరి శోభన్‌గౌడ్‌కు సమాచా రమందించారు. మరికొందరు యువకులు, స్థానికులతో కలిసి బుధవారం రాత్రి సాంబశివుని బోరుకు చెట్లపొదల్లో వృద్ధురాలి ఆచూకీ కోసం గాలించి ఎట్టకేలకు గుర్తించి జిల్లా సంక్షేమశాఖ అధికారికి సమాచారమందించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరేష్ తన సిబ్బందితో తరలివచ్చి వృద్ధురాలిని జగిత్యాల జిల్లా ప్రధానాసుపత్రిలో వైద్య చికిత్సలు చేయించిన అనంతరం సఖి కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం వృద్ధురాలి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు.

పూర్తిగా నడవలేనిస్థితిలో ఉన్న వృద్ధురాలు శ్రీరాములపల్లె ఐకేపీ కేంద్రం నుంచి సుమారు 2కిలోమీటర్ల దూరంలోఉన్న సాంబశివుని బోరుకు ఎలా వెళ్లిందన్నది ప్రశ్నార్థకంగా మారింది. వృద్ధురాలి కూతురు తన భర్త, పిల్లలతో కలిసి గుట్టబోరుకు వదిలివెళ్లిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డీడబ్ల్యూవో బోనగిరి నరేష్, ఎఫ్ఆర్‌వో మతులాపురం కొండయ్య, డీసీపీవో హరీష్, జెండర్ స్పెషలిస్ట్ బోయపోతు గౌతమి, సఖి కేంద్రం సిబ్బంది రజిత, స్థానికులు సల్లూరి శోభన్ గౌడ్, శ్రీకోటి రమపతి, గడ్డం మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉన్న భూమి లాక్కుని వృద్ధురాలి గెంటివేత

వేల్పుల బూదమ్మకు ఇస్లాంపురాలో సొంత ఇల్లుతో పాటు ఎకరం వ్యవసాయ భూమి ఉండగా జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్‌లో ఉంటున్న కూతురు ఇటీవలే భూమని తన పేరిట బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు అధికారులు గుర్తించారు. అంతేకాకుండా 15 రోజుల అనంతరం వృద్ధురాలిని చితకబాది ఇంటిలో నుంచి గెంటివేయడంతో వృద్ధురాలు మతిస్థిమితం కోల్పోయి బయటికి వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. శ్రీరాములపల్లె యువకుడు వృద్ధురాలి ఆచూకీ తెలపడంతో రాత్రిపూట వచ్చి గుట్టబోరుకు వదిలివెళ్లినట్లు అధికారులు, స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఎనిమిదో రోజుకు స్వర్ణకారుల రిలేదీక్షలు

● మద్దతు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



ముస్తాబాద్‌లో స్వర్ణకారుల రిలేదీక్షకు సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ముస్తాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ ఎదుట కొనసాగుతున్న స్వర్ణకారుల రిలే దీక్షలు గురువారం ఎనిమిదో రోజుకు చేరాయి. దీక్షలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడి ఆధ్వర్యంలో నాయకులు సంఘీభావం తెలిపారు. కుల వృత్తులను కాపాడుకోవాలని, చేతివృత్తుల మీద జరుగుతున్న దాడికి నిరసనగా రిలే దీక్షలు జరుగుతున్నాయన్నారు. స్థానికంగా నూతనంగా ఏర్పాటు చేస్తున్న జ్యువెలరీ షాప్‌ను పెట్టవద్దని షాప్‌ను పెట్టడం ద్వారా స్వర్ణకారుల ఉపాధి దెబ్బతింటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకారులు చింతోజు బాలయ్య, రాజు, ఈశ్వరయ్య, రవి, సత్యం, రఘు, వెంకటేశ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గజ్జెల రాజు గుండెల్లి శ్రీనివాస్, దీటి నర్సింలు, ఉచ్చిడి బాల్‌రెడ్డి, రంజాని నరేశ్, మిరుదొడ్డి భాను తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యం, ఒంటరితనం భరించలేక ఆత్మహత్య

వీణవంక, మే 1 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం, ఒంటరితనం భరించలేక వీణవంక మండలం బొంతుపల్లి గ్రామానికి చెందిన కేంశెట్టి మహేష్(57) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. మహేష్ కొంతకాలంగా ఒంటరిగా ఉంటూ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు సునీల్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి విగ్రహ శోభాయాత్ర



ముత్యంపేటలో పెద్దమ్మతల్లి శోభాయాత్రను నిర్వహిస్తున్న గ్రామస్థులు

మల్లాపూర్, మే, 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముత్యంపేట గ్రామంలోని పెద్దమ్మ తల్లి జాతర ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. గురువారం జాతరలో భాగంగా పెద్దమ్మతల్లి విగ్రహాన్ని శోభ యాత్రగా ఆలయానికి ఘనంగా తీసుకొచ్చారు. ఈ సందర్భంగా భక్తి శ్రద్ధలతో భక్తులు అమ్మ వారిని డప్పు చప్పుల్ల మధ్య శోభ యాత్రగా ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు తదితరులు పాల్గొన్నారు. జాతర వేడుకలు ఈనెల 4వ తేదీ వరకు ఘనంగా కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

భూమి ఆక్రమించారని రైతు ఆత్మహత్య

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్ర జ్యోతి): జగిత్యాల రూరల్ మండలం పోరండ్ల గ్రామానికి చెందిన పడిగెల మల్లారెడ్డి(45) అనేరైతు భూమిని కొంత మంది వ్యక్తులు ఆక్రమించారని మన స్థాపానికి గురై పురుగులమందు తాగి గురువారం ఉదయం ఆత్మహత్యకు పాల్ప డ్డట్లు జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం పోరండ్ల గ్రామానికి చెందిన మల్లారెడ్డిని అతడి భార్య అనూషను అదే గ్రామానికి చెందిన పడిగెల గంగారెడ్డి, జనార్దన్‌రెడ్డి, రాజిరెడ్డి, రాజవ్వ, రమ అనే వ్యక్తులు గత కొంతకాలంగా ఇష్టం వచ్చినట్లు తిట్టడమే కాకుండా, పోరండ్ల గ్రామంలోని పోచమ్మ ఆలయం వద్ద గల భూమిని మల్లారెడ్డి ఈనెల 27వ తారీఖున చదునుచేయుటకు వెళ్లగా ఆరుగురు వ్యక్తులు మల్లారెడ్డిని భూమివద్దకు వస్తే చంపేస్తామని బెదిరించారు. దీంతో అప్పటినుంచి మనస్థాపానికి గురైన మల్లారెడ్డి గురువారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకోగా గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం కరీంనగర్ లోని ప్రతిమ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సాయంత్రం మల్లారెడ్డి మృతిచెందాడు. మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

మామిడి మార్కెట్‌లో ఫీజు ఎగవేత



జగిత్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ

- ప్రతి యేటా రూ. కోట్లలో వ్యాపారం
- మార్కెట్ ఆదాయం మాత్రం రూ. అరకోటి లోపే
- జగిత్యాల మామిడి మార్కెట్‌లో వ్యాపారుల గోల్‌మాల్
- కట్టడి చేస్తేనే మార్కెట్‌కు ఆదాయం

జగిత్యాల, మే 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మామిడి మార్కెట్‌లో వ్యాపారుల మాయాజాలం కొనసాగుతోంది. వ్యాపారుల గోల్‌మాల్ వల్ల మామి డి సీజన్‌లో మార్కెట్ దాదాపుగా రూ. కోటిన్నరకు పైగా నష్టపోతుందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నా యి. ప్రతి యేటా రూ. వంద కోట్ల నుంచి రెండు వందల కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుందన్న అంచనాలున్నాయి. కొన్ని సంవత్సరాలుగా మార్కెట్ కమిటీకి దాదాపుగా రూ. అరకోటి ఆదాయం మాత్ర మే లభిస్తోంది. నిబంధనల ప్రకారం వ్యాపారులు నిర్వహించిన కొనుగోళ్లలో మార్కెట్ కమిటీకి ఒక్క శాతం ఫీజు రూపేనా చెల్లించాల్సి ఉంటుంది. మార్కెట్‌లో రూ. కోట్లలో వ్యాపారం నిర్వహిస్తున్న ప్పటికీ మార్కెట్ ఫీజు మాత్రం అంతంతమాత్రం గానే చెల్లిస్తున్నారు. దీంతో మార్కెట్‌కు తగిన ఆదా యం రావడం లేదు. గత 17 సంవత్సరాల క్రితం ఏర్పాటయిన జగిత్యాల వ్యవసాయ మార్కెట్‌కు యేటా రూ. 50 నుంచి రూ. 60 లక్షల లోపు మాత్ర మే ఆదాయం వస్తోంది.



విక్రయానికి వచ్చిన మామిడి కాయలు

జగిత్యాలలో మామిడి మార్కెట్ పరిస్థితి ఇలా

జగిత్యాల శివారులోని చల్‌గల్ మామిడి మార్కెట్‌ను 2005 సంవత్సరంలో సుమారు 23 ఎకరాల్లో ఏర్పాటు చేశారు. గత యేడాది రూ. 10 కోట్లు వెచ్చించి యార్డులో మామిడి మార్కెట్‌కు అవ సరమైన షెడ్డులను నిర్మించారు. మామిడి కాయల కొనుగోలుకు యార్డు పరిధిలో 88 మంది కమీషన్ ఏజంట్లు, 59 మంది అడ్తి వ్యాపారులు న్నారు. దీనికి తోడు ఎటువంటి లైసెన్సులు లేకుండా సుమారు పాతిక మంది వరకు వ్యాపారం నిర్వహి స్తున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రతి యేటా జగి త్యాల మామిడి మార్కెట్‌కు సుమారు 5 వేల మంది కార్మికులు ఇతర రాష్ట్రాల నుంచి వస్తుంటారన్నారు. వ్యాపారు లు ప్రతి సీజన్‌లో సుమారు రూ. 100 కోట్ల నుంచి రూ. 200 కోట్లకు పైగా టర్నోవర్ చేస్తుంటారు.

ఇతర రాష్ట్రాలకు మామిడి తరలింపు

జగిత్యాల నుంచి మామిడి కాయలను ఢిల్లీ, జమ్మూ, కశ్మీర్, చండీఘడ్, హర్యానా, పంజాబ్, నాగ్ పూర్ వంటి రాష్ట్రాలకు లారీల్లో తరలిస్తుంటారు.

అంతంతమాత్రంగానే ఆదాయం

జగిత్యాల మామిడి మార్కెట్‌లో గత యేడాది రూ. 63.29 లక్షల ఫీజు మాత్ర మే వసూలైంది. 2022-23 సీజన్‌లో రూ. 43.28 లక్షలు ఫీజు వసూలైంది. అదే విధంగా 2021-22 సంవత్సరంలో రూ. 60.90 లక్షలు, 2020-21 సంవత్సరంలో 91.70 లక్షలు, 2019-20 సంవత్సరంలో రూ. 69.65 లక్షలు, 2018-19 సంవత్సరంలో రూ. 64.01 లక్షలు, 2019-18 సంవత్సరంలో 71.89 లక్షలు మార్కెట్ ఫీజు వసూలు అయినట్లు రికార్డులు తెలుపుతున్నా యి. మార్కెట్ లైసెన్స్ తీసుకోవడానికి, నిర్ణీత ఫీజు చెల్లించడానికి వ్యాపారులు పెద్దగా ఆసక్తిచూపడం లేదు.

నోటీసులు జారీ చేసినా రాని ఫలితం

మార్కెట్ యార్డులకు రైతులు తీసుకొని వచ్చిన పంట ఉత్పత్తు లను వ్యాపారులు కొనుగోలు చేస్తారు. వ్యాపారులు చేపట్టే లావాదేవీల ఆధారం గా మార్కెట్ యార్డుకు సెస్ చెల్లిస్తారు. మార్కెట్ ఫీజు చెల్లింపు ప్రధాన ఆదాయ వనరుగా ఉంటోంది. గత యేడాది యార్డులో ప్రారంభించిన షెడ్లలోనే మామిడి కాయల కొనుగోళ్లు జరపాలని, యార్డు వెలుపల క్రయ విక్రయాలు జరి గితే చర్యలు తీసుకుంటామని అధికారు లు హెచ్చరిస్తున్నప్పటికీ కొందరు వ్యాపా రులు పట్టించుకోకుండా యార్డు వెలుపల నే కొనుగోళ్లు ప్రారంభించారు. అధికారు లు నోటీసులు జారీ చేసినా ఫలితం రావడం లేదు. మార్కెట్ ఫీజు ఎగవేయ డానికే వ్యాపారులు ఎత్తులు వేస్తున్నా రన్న ఆరోపణలున్నాయి. అధికారులు పక డ్బందీ చర్యలు తీసుకొని ఆదాయానికి గండి పడకుండా చూడాల్సిన అవసర ముందని రైతులు కోరుతున్నారు.

ప్రతి నిత్యం 20 నుంచి 30 లారీల్లో మామిడికాయలు వివిధ ప్రాంతా లకు తరలిపోతుంటాయి. పెద్ద లారీల్లో సుమారు 12 నుంచి 15 టన్నుల మామిడి కాయలను తరలి స్తుంటారు. గత నాలుగు, ఐదేళ్లగా సగటున టన్ను కు రూ. 30 వేల వరకు మామిడి ధర పలికింది. టన్నుకు రూ. 30 వేల చొప్పున 15 టన్నులకు రూ. 4.50 లక్షలు అవుతోంది.

వ్యాపారులు మార్కెట్‌కు ఒక్క శాతం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో లారీకి రూ. 4,500 ఫీజు చెల్లిం చాలి. ప్రతి రోజు 30 లారీల్లో మామిడి కాయలు తరలితే సుమారు రూ. 1.62 లక్షలు ఫీజు రూపేనా మార్కెట్‌కు ఆదాయం రావాల్సి ఉంది. దాదాపుగా నాలుగు నెలల పాటు మామిడి మార్కె ట్ కొనసాగుతోంది. ఈ లెక్కన రూ. కోటిన్నరకు పైగా మార్కెట్‌కు మామిడి వ్యాపార ఆదాయం చేకూరాలన్న అంచనా ఉంది. దీనికి తోడు మామిడి కాయ ధరలు పెరిగిన సందర్భాల్లో దాని ప్రకారం ఫీజు అధికారులు వసూలు చేయాలి. కాగా వ్యాపా రులు అధిక రేటుకు మామిడి కాయలు కొనుగోలు చేసినప్పటికీ తక్కువ రేటుకు కొనుగోలు చేశామని గోల్‌మాల్ చేస్తూ ఆ మేరకు మాత్రమే అధికారు లకు మార్కెట్ ఫీజు చెల్లిస్తున్నారు. అధికారులకు పరిస్థితి తెలిసిన ప్పటికీ చూసిచూడనట్లు వ్యవహరి స్తున్నారు. ఫలితంగా మార్కెట్ ఆదాయం కోల్పోవలసి వస్తోంది.

చర్యలు తీసుకుంటాం

ప్రకాశ్, జిల్లా మార్కెటింగ్ అధికారి, జగిత్యాల



జగిత్యాలలోని మామిడి మార్కెట్‌లో వ్యాపారులు మార్కె ట్ ఫీజు చెల్లించేలా పకడ్బందీ చర్యలు తీసు కుం టాం. మార్కెట్ ఆదాయానికి గండి కొట్టే వ్యాపా రులను గుర్తిస్తాం. ఎప్పటికప్పుడు క్రయవిక్రయాల పై పర్యవేక్షణ చేస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటాం.

ఇటలీ వధువు.. వేములవాడ వరుడు..

- సంప్రదాయ పద్ధతిలో ఘనంగా వివాహం



నూతన జంటను ఆశీర్వదిస్తున్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, మే 1 (ఆంధ్రజ్యోతి): ఇటలీ దేశానికి చెందిన యువతి.. వేములవాడకు చెందిన యువకుడు హిందూ సంప్రదాయ పద్ధతిలో వివాహం చేసుకున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణానికి చెందిన ఓలిమినేని నిత్యానందరావు-వీణారాణి దంపతుల కుమారుడు శ్రీకర్‌రావు ఫ్రాన్స్ దేశంలో ఉన్నతవిద్య అభ్యసించాడు. ఆ క్రమంలో ఇటలీకి చెందిన వైద్యురాలు ఫెదిరికతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. బుధవారం రాత్రి స్థానిక మహారాజ ఫంక్షన్‌హాల్‌లో హిందూ సంప్రదాయ పద్ధతిలో వేద మంత్రాల సాక్షిగా వారిద్దరూ ఒకటయ్యారు. వివాహానికి వధువు తరపున ఇటలీనుంచి సుమారు 25మంది బంధుమిత్రులు హాజరయ్యారు. నూతనవధూవరులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మాజీఎమ్మెల్యే రేగులపాటి పాపారావు తదితరులు ఆశీర్వదించారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని రైతుల ఆందోళన



రైతులతో మాట్లాడుతున్న ఎస్సై

రాయికల్, మే 1 (ఆంధ్రజ్యోతి): వరి కోతలు ప్రారంభమై నెల రోజులైనా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించడం లేదని జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని వీరాపూర్ గ్రామానికి చెందిన రైతులు గురువారం జగిత్యాల-రాయికల్ ప్రధాన రహదారిపై ఉప్పుమడుగు స్టేజీ వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను కోసి ధాన్యాన్ని కుప్పలు పోసి చాలా రోజులవుతున్నా అధికారులు కొనుగోళ్లు ప్రారంభించలేదని మండిపడ్డారు. అకాల వర్షాలు పడి ధాన్యం తడిస్తే తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోయారు. వెంటనే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘటనా స్థలానికి జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్, తహసీల్దార్ ఖయ్యూం, ఎస్సై సుధీర్ రావులు చేరుకుని రైతులతో మాట్లాడి కొనుగోళ్లు ప్రారంభిస్తామని చెప్పి ఆందోళనను విరమింపజేశారు.

శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోవాలి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న చిరుతల రామాయణం కళాకారులు

వెల్గటూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోవాలని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుధవారం రాత్రి ముత్తునూరు గ్రామంలో ప్రదర్శించిన ఆధ్యాత్మిక కార్యక్రమం చిరుతల రామాయణం పట్టాభిషేకంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రేక్షకుల మధ్యన నాయకులతో కలిసి కూర్చుని చిరుతల రామాయణం లోని పాత్రలు, సన్నివేశాలను ఆసక్తిగా తిలకించారు. అనంతరం అడ్లూరి మాట్లాడుతూ రామాయణం గొప్పదనాన్ని, శ్రీరాముడి గొప్పదనాన్ని చిరుతల రామాయణం రూపంలో గ్రామీణ ప్రాంతం వారికి అర్థమయ్యే రూపంలో కళాకారుల ప్రదర్శించడం గొప్ప విషయం అన్నారు. కళాకారులకు పది వేల రూపాయాల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోల్ల తిరుపతి, అనుమాల మంజుల, సందీప్‌రెడ్డి, ఎలుక రాజు, శ్రీకాంత్‌రావు, తిరుమలేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతదే

- ఎమ్మెల్సీ సురభి వాణిదేవి



దుద్దెనపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సురభి వాణిదేవి

సైదాపూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతదేనని ఎమ్మెల్సీ సురభివాణిదేవి అన్నారు. గురువారం సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి, సోమారం, లక్ష్మన్నపల్లి, ఆరెపల్లి, ఎక్లాస్‌పూర్, దుద్దెనపల్లి గ్రామాల్లో డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశస్వాతంత్రం కోసం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లాంటి వారిని నేటియువత ఆదర్శంగా తీసుకొని స్వం తంగా ఎదుగుతూ దేశాభివృద్ధిలో పాలు పంచుకోవాలన్నారు. యువత మత్తుకు, మద్యానికి, ఇతర చెడు వ్యసనాలకు బానిసలై అర్ధాంతరంగా చనిపోతున్నారన్నారు. రానున్న రోజుల్లో దేశంలో యువత యొక్క సంఖ్య గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందన్నారు. మనపిల్లలను చెడు వ్యసనా లకు అలవాటు కాకుండా డ్రగ్స్ లాంటి మత్తు మహమ్మారిని మన గ్రామాల్లోకి రాకుండా పోరాటంచేసి యువతను కాపాడాలని మహిళ లోకాన్ని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం కుమార స్వామి, హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి, జేఏసీ కో-ఆర్డినేటర్ ద్యాగల సారయ్య, ఎదులాపురం తిరుపతి, చెప్యాల ప్రకాష్, మాట్ల వెంకటస్వామి, గాండ్ల పద్మ, జగదీష్, కుమారస్వామి, ఆశీర్వాదం, ప్రభాకర్, ప్రవీణ్, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కుమారస్వామి, రాజిరెడ్డి, రాజయ్య, యుగంధర్, రవీందర్, రాజేందర్, రజిత, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజే శ్వరస్వామి వారి ఆలయంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. మే డే సందర్భంగా సెలవురోజు కావడంతో రాజన్న ఆలయానికి భక్తులు తరలి వచ్చి రాజన్నకు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయం

ఆలూరులో ఘనంగా పోచమ్మ బోనాలు

రాయికల్, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలం లోని ఆలూరు గ్రామంలో గురువారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు ఇంటికో బోనంతో ఊరేగింపుగా తరలివెళ్లి గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహం వద్ద నైవేద్యాలు సమర్పించారు. అలాగే దావత్ పూజారులు మేకను గావుపట్టారు. పిల్లాపాపా, గొడ్డూ గోదాను చల్లంగా చూడాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామనాయకులు, యువకులు తదిత రులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న పూజారులు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

జాతీయ కవి సమ్మేళనానికి దేవానందం

సిరిసిల్ల, మే 1 (ఆంధ్ర జ్యోతి): తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో ఈనెలలోన హైదరాబాద్, త్యాగరాయ గాన సభలో జరిగే జాతీయ కవిసమ్మేళనంలో సిరిసిల్లకు చెందిన ప్రముఖకవి బూర దేవనాందంకు కవితాగానం చేయడానికి ఆహ్వానించారు. తెలుగు భాషకు పట్టాభిషేకం పేరుతో నిర్వహించే భాష సదస్సు, కవిసమ్మేళనంలో కవి తను వినిపించనున్న దేవానందంను సిరిసిల్ల జిల్లా రచయితల సంఘం, జిల్లా మానేరు రచయితల సంఘం, సిరిసిల్ల సాహితీ సమితి, కవులు, రచయితలు అభినందించారు.



దేవానందం

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లన్నపల్లి గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుం డగా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. కోర్కల్ గ్రామంలోని మానేరు వాగునుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టాక్టర్ డ్రైవర్,ఓనర్ రావణ వేణి సదయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

ప్రైవేటు యూనివర్సిటీలపై చర్యలు తీసుకోవాలి

గణేశ్‌నగర్, మే1 (ఆంధ్రజ్యోతి): ఐకార్ నుంచి అనుమతులు లేకుండా కేవలం రాష్ట్ర ప్రభుత్వ అనుమతి ఉందనే పేరుతో నిర్వహిస్తున్న ప్రైవేటు యూనివర్సిటీలపై చర్యలు తీసుకోవాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి కోరారు. గురువారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం తిరుపతి మాట్లాడుతూ యూనివర్సిటీల్లో అగ్రికల్చర్ కోర్సులను ఉన్నాయని చెబుతూ విద్యార్థులను, తల్లిదండ్రులను తప్పుదారి పట్టిస్తూ అడ్మిషన్లు చేపడుతున్న కావేరీ యూనివర్సిటీ ఇతర ప్రైవేట్ యూనివర్సిటీల గుర్తింపు రద్దు చేయాలని, తక్షణమే కేసులు నమోదు చేయాలని అన్నారు. అనుమతులు తీసుకోకుండా విద్యార్థులను యూనివర్సిటీలో చేర్చుకోవడంతో చదువుల పూర్తయిన తర్వాత వచ్చే సర్టిఫికెట్‌తో ఎలాంటి ఉపయోగముండదన్నారు. భవిష్యత్‌లో ఉద్యోగాలకు అనర్హులుగా ఉంటారని తెలిపారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా విజిలెన్స్ కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేపట్టాలన్నారు. అనంతరం సానుకూలంగా స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వర్ మాట్లాడుతూ దీనిపై తక్షణమే ఉన్నతాధికారులతో మాట్లాడి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నాయకులు సుమన్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేస్తున్న యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి


జెండా ఆవిష్కరిస్తున్న వాసుదేవరెడ్డి

ఘనంగా మేడే

జిల్లా వ్యాప్తంగా వేడుకలు

భగత్‌నగర్, మే1(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మేడే వేడుకలను గురువారం కార్మికులు ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుంచి ముకుందలాల్ మిశ్రా భవన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి జెండా ఆవిష్కరించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోతిరాంపూర్‌లోని పార్టీ కార్యాలయంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, నగరంలోని లేబర్ అడ్డా, ఐఎంఎల్ డిపో వద్ద సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గుడికందుల సత్యం జెండా ఆవిష్కరించారు. శనివారం మార్కెట్‌లో ట్రాన్స్‌పోర్టు హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాయమల్లు కార్మిక జెండాను ఎగురవేశారు.

సుభాష్‌నగర్: రైతు, ప్రజా సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు నగరంలోని కార్యాలయంలో మేడే నిర్వహించారు.

జిల్లా జనరల్ ఆస్పత్రిలో భారత కమ్యూనిస్టు పార్టీ(1725) రాష్ట్ర కార్యదర్శి తూం రామారావు మేడే వేడుకలు నిర్వహించారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలం చామనపల్లిలో హమాలీ కార్మికులు ఏర్పాటు చేసిన జెండాను సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి సురేందర్ రెడ్డి ఎగురవేశారు. నగునూర్‌లో సీఐటీ యూ, హమాలీ జెండాలను సంఘం అధ్యక్షుడు నెల్లి రాజేశం ఎగుర వేశారు. సీపీఐ రూరల్ కార్యదర్శి రాయమల్లు పాల్గొన్నారు.

బొమ్మకల్‌లో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కాంగ్రెస్ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ జెండాను ఆవిష్కరించారు.

గణేశ్‌నగర్: తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ కార్యాలయంలో యూనియన్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు పద్మారెడ్డి జెండా ఎగురవేశారు.

హుజూరాబాద్/శంకరపట్నం/ఇల్లందకుంట/వీణవంక/గంగాధర/తిమ్మాపూర్/గన్నేరువరం/జమ్మికుంట రూరల్/ చిగురుమామిడి/మానకొండూరు/సైదాపూర్: హుజూరాబాద్ డివిజన్, మండలకేంద్రాల్లో, గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. శంకరపట్నం సీపీఐ కార్యాలయంలో రాష్ట్ర బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ అండ్ వర్క్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్య ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి ఏఐటీయూసీ జెండా ఆవిష్కరించారు. వీణవంకలో సీఐటీయూ హమాలీ సంఘం జిల్లాఅధ్యక్షుడు పిల్లి రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలో సీఐటీయూ, సీపీఎం నాయకులు జెండా ఆవిష్కరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. సైదాపూర్ మండలకేంద్రంలో సీపీఐ జిల్లాకార్యవర్గ సభ్యుడు బత్తుల బాబు జెండాను ఆవిష్కరించారు.

చొప్పదండి: చొప్పదండి వ్యవసాయ మార్కెట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో, రుక్మాపూర్‌లో హనుమాన్ హమాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.


జమ్మికుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

ప్రజా సమస్యల పరిష్కారానికి 'ఎమ్మెల్యే ఆన్ వీల్స్'

(5వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. తిమ్మాపూర్ మండలంలోని నుస్తులాపూర్‌లో ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు, అవసరమైతే సంబంధిత మంత్రులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమంపై పత్రికల్లో వచ్చిన కథనాలను చూసి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తనను అభినందించారని తెలిపారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించాలనే చిత్తశుద్ధితో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సతీమణి డాక్టర్ కవ్వంపల్లి అనూరాధ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమం ద్వారా యాప్‌లో నమోదైన ప్రతి సమస్యను కేటగిరి వారీగా విభజించి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండారి రమేష్, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్ఎల్ గౌడ్, ఒగ్గు దామోదర్, నాయకులు తమ్మనపల్లి శ్రీనివాస్ రావు, గోగూరి నర్సింహరెడ్డి, కొత్త తిరుపతిరెడ్డి, సిరిగిరి రంగారావు, పోలు రాము, రమేష్, బుదారపు శ్రీనివాస్, పోతిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, తిమ్మాపూర్ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలం చామనపల్లిలో రాజీవ్ యువవికాసం పథకం దరఖాస్తులను గురువారం ఎంపీడీవో సంజీవరావు పరిశీలించారు.

గణేశ్‌నగర్: కరీంనగర్‌లో గురువారం పూలే, అంబేద్కర్ జీవితం, కులవివక్ష, ప్రత్యక్ష ప్రతిఘటన పోరాటాలపై కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి తిప్పా రపు సురేష్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండల తహసీల్దార్‌గా బదిలీపై వచ్చిన రాజేష్‌ను కరీంనగర్ మండల మీసేవ నిర్వాహకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో వేముల అశోక్, ఆవారి రమేష్, పాలకొండ సత్యం, కైతోజు విజయకుమార్, చారి, బట్టు రాజేందర్, మెరుగు శ్రీధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: ఈ నెల 7వ తేదీ వరకు నిర్వహించనున్న విద్యుత్ భద్రత వారోత్సవాల పోస్టర్‌ను టీజీ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయంలో పర్యవేక్షక ఇంజనీర్ రమేష్ బాబు ఆవిష్కరించారు.

కరీంనగర్ కల్చరల్: ఈ నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు భగత్‌నగర్ అయ్యప్ప ఆలయంతోపాటు సముదాయ ఆలయాల వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు.

అల్ఫోర్స్‌కు అత్యుత్తమ మహిళా డిగ్రీ కళాశాల అవార్డు


అవార్డు అందుకుంటున్న కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి

భగత్‌నగర్, మే 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలకు జాతీయ స్థాయిలో అత్యుత్తమ మహిళా కళాశాల అవార్డు దక్కింది. ఢిల్లీలోని ఆసియా టుడే మీడియా సంస్థ నిర్వహించిన ప్రపంచ విద్యాసమ్మిట్-2025లో భాగంగా తెలంగాణలో అల్ఫోర్స్ డిగ్రీ కళాశాలను ఉత్తమ మహిళా డిగ్రీ కళాశాలగా గుర్తించారు. ఢిల్లీలోని హోటల్ ది పార్క్ పార్లమెంట్ స్ట్రీట్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి భూషణ్‌చౌదరి, పీజీ కమిషన్ కౌన్సిలర్ నీలేష్‌కుమార్, ఢిల్లీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మోహన్‌సింగ్ చేతుల మీదుగా అల్ఫోర్స్ డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ వూటుకూరి రవీందర్‌రెడ్డి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో అల్ఫోర్స్ డిగ్రీ కళాశాల మరో గౌరవప్రదమైన అవార్డును అందుకుందన్నారు. ఈ గుర్తింపు తమ బాధ్యతను మరింత పెంచిందన్నారు.

మహిళా కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన

కరీంనగర్ అర్బన్, మే1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 35వ డివిజన్ శ్రీనగర్‌కాలనీలో మహిళా సమాఖ్య భవనానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక మాజీ కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి, మహిళా సమాఖ్య సభ్యుల కోరిక మేరకు రూ.10 లక్షల సుడా నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, నేతికుంట యాదయ్య, సరిల్ల ప్రసాద్, పిట్టల శ్రీనివాస్, డీఈ రాజేంద్రప్రసాద్, ఏఈ సతీష్, మహిళా సమైఖ్య సంఘం అధ్యక్షురాలు భాగ్యలక్ష్మీ, ఆర్పీ విజయ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, మే1 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శుక్రవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ వన్, టు, రూరల్, ఏడీఈలు శ్రీనివాస్ గౌడ్, లావణ్య, రఘు ప్రకటనలో తెలిపారు. ఉదయం 8:30 నుంచి 10:30 వరకు హనుమాన్ నగర్, మహాలక్ష్మి రెసిడెన్సీ, జగన్ పిండి గిర్ని, మధుర విలాస్, మార్వాడి హౌస్, తిరుపతి హౌస్ డీటీఆర్, ఉదయం 8 గంటల నుంచి 10 వరకు ప్రగతినగర్, మార్కండేయనగర్, సాయిబాబా ఆలయం, లారెల్ పాఠశాల, ఉదయం 7 గంటల నుంచి 9:30 వరకు వావిలాలపల్లి, జెండా గద్దె, భారత్ పెట్రోల్ పంప్, ఉదయం 8గంటల నుంచి 11 వరకు గుంటూర్‌పల్లి, దుర్శేడ్, గోపాల్‌పూర్, ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు కొత్తపల్లి, కిమ్స్ కళాశాల, ఢిల్లీ జూనియర్ కళాశాల, సీతారాంపూర్, రేకుర్తి చౌరస్తా ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్‌పట్టణంలోని గణేష్‌నగర్‌లో ఫీడర్ ట్రీకటింగ్, కరెంటు లైన్ వర్క్ మరమ్మతు నిమిత్తం ఉదయం 7నుంచి 9గంటల వరకు గణేష్‌నగర్, బస్టాండ్, జమ్మికుంటరోడ్, ప్రతాపవాడ, మామిండ్లవాడలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్‌ఏఈ శ్రీనివాస్‌గౌడ్ గురువారం తెలిపారు

పురుమల్ల శ్రీనివాస్‌ను పార్టీ నుంచి బహిష్కరించాలి

కరీంనగర్ అర్బన్, మే1 (ఆంధ్రజ్యోతి): మంత్రి పొన్నం ప్రభాకర్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్‌ను పార్టీ నుంచి బహిష్కరించాలని బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి రహమతు హుస్సేన్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ గడ్డం విలాస్ రెడ్డి అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. డీసీసీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఏఐసీసీ ఇన్‌చార్జి విశ్వనాథన్ సమక్షంలోనే మంత్రిపై ఆరోపణలు చేసి సమావేశం గందరగోళానికి దారి తీసే విధంగా ప్రవర్తించిన శ్రీనివాస్‌పై తక్షణమే వేటు వేయాలని డిమాండ్ చేశారు.

టీపీసీసీ అధ్యక్షుడికి ఫిర్యాదు

డీసీసీ కార్యాలయంలో నాలుగు రోజుల కిందట జరిగిన గొడవపై కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్‌పై టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, నాయకులు బోనాల శ్రీనివాస్, ఎస్ఏ మోసిన్, చక్రధర్‌రావు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం హైదరాబాద్‌కు వెళ్లిన నాయ కులు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి ఘటనపై వివరించారు.

మంత్రిపై తప్పుడు ఆరోపణలు

మంత్రి పొన్నం ప్రభాకర్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్న పురుమల్ల శ్రీనివాస్‌పై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కరీంనగర్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి, డైరెక్టర్లు కోరారు. ఈ మేరకు గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు పారాచూట్ నాయకుడిగా పార్టీలోకి ప్రవేశించిన శ్రీనివాస్ వ్యక్తిగత ఎజెండాతో మంత్రిపై కుట్రపూరితంగా వ్యవహరిస్తూ పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించారన్నారు.

ఫైరింగ్ శిబిరానికి సెయింట్ జార్జ్ విద్యార్థులు


అభినందిస్తున్న పాఠశాల చైర్మన్ ఫాతిమారెడ్డి

భగత్‌నగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ (సీబీఎస్ఈ) పాఠశాల విద్యార్థులు ఫైరింగ్ సెలక్షన్స్ రెండో లెవల్‌కి ఎంపికయ్యారు. గురువారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఫైరింగ్ సెలక్షన్స్ రెండో లెవల్‌కి ఎంపికైన కేశవకీర్తన్, నేహవర్ధన్, సాయి రాజ్‌ను పాఠశాల చైర్మన్ డాక్టర్ పి.ఫాతిమారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ 9టీ బెటాలియన్ కరీంనగర్‌లో సెలక్షన్ నిర్వహించినట్లు చెప్పారు. రెండో లెవల్ మే3న ఎలగందల్‌లో ఉంటుందన్నారు. ఎన్‌సీసీ బృందాన్ని, ఎన్‌సీ కేర్ టేకర్ దివ్యను అభినందించారు.

స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులకు కలెక్టర్ అభినందన

కరీంనగర్ స్పోర్ట్స్, మే 1(ఆంధ్రజ్యోతి): పదోతరగతిలో ప్రతిభ చాటిన నగరంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాల విద్యార్థులను కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు. పాఠశాల విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించారు. గుగులోతు విశ్వంత్ 553 మార్కులు, అడవి దీపక్ 548, కట్ల సాయి వర్షిణి 521 మార్కులు సాధించారు. విద్యార్థులను అదనపు కలెక్టర్‌లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డిస్ట్రిక్ట్ యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్ శ్రీనివాస్‌గౌడ్, హెచ్‌ఎం కోత్వాల్ శ్రీనివాస్ అభినందించారు.

పది ఫలితాల్లో 'సువిద్య' విజయభేరి



విద్యార్థులతో పాఠశాల కరస్పాండెంట్ మట్టతిల్ బాబు

భగత్‌నగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): విద్యానగర్‌లోని 'సువిద్య' ఉన్నత పాఠశాల విద్యార్థులు పది ఫలితాల్లో విజయభేరి మోగించారు. పాఠశాలకు చెందిన ఎ.వర్షిత్ 561, పి.మణికంఠ 556, రోషిణి 551, భవ్యశ్రీ 549 మార్కులతో ప్రతిభ కనబరిచారన్నారు. మొత్తం 25 మంది విద్యార్థులకు 100 శాతం ఉత్తీర్ణత శాతం సాధించారు. 17 మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించడం గర్వకారణమని పాఠశాల కరస్పాండెంట్ మట్టతిల్ బాబు అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల అకాడమిక్ ఇన్‌చార్జి శేషుమణి, ప్రిన్సిపాల్ మధుకుమార్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

సత్తా చాటిన 'ఫండస్' పాఠశాల విద్యార్థులు


విద్యార్థులతో ఫండస్ పాఠశాల చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్ గోపు సుశాంక్‌రెడ్డి

భగత్‌నగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి ఫలితాల్లో ఫండస్ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో సత్తా చాటారు. వంద శాతం ఉత్తీర్ణ సాధించిన సందర్భంగా విద్యార్థులను గురువారం పాఠశాల డైరెక్టర్ గోపు సుశాంక్‌రెడ్డి అభినందించారు. అనంతరం పాఠశాల చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విలువలతో కూడిన బోధన విజ్ఞాన సముపార్జనే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు చెప్పారు. ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు ఒకే పాఠశాలలో చదివి ప్రఖ్యాత ఐఐటీ, ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీట్లు సాధిస్తున్న ఏకైక విద్యా సంస్థగా ఫండస్ గుర్తింపు పొందిందన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన మానసకు సన్మానం


మానసను సన్మానిస్తున్న బీసీ, ప్రజాసంఘాల నాయకులు

హుజూరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణం విద్యానగర్‌లోని బత్తుల మానస జూనియర్ సివిల్ జడ్జీగా ఇటీవల ఎంపికైంది. గురువారం బీసీ, ప్రజాసంఘాల నాయకులు ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బాబు, వెంకన్న, నర్మద, మనోజ్, ఉమాదేవి, అర్జున్, రాజేందర్, రాజయ్య, మధుకర్, ప్రవీన్, కనకయ్య, రాజయ్య, రాజేందర్, లక్ష్మణ్, అచ్యూత్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన ఉత్తీర్ణత శాతం

గంగాధర, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాఠశాలల్లో ఈ యేడాది గతేడాదికంటే 1.47శాతం పదవతరగతి ఉత్తీర్ణత పెరిగిందని ఎన్ఎస్‌యూఐ రాష్ట్రకార్యదర్శి తాళ్ల సుమంత్ తెలిపారు. గురువారం ఆయన గంగాధరలో మాట్లాడారు. సీఎంరేవంత్‌రెడ్డి విద్యారంగంపై తీసుకున్న సంస్కరణలు, ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ ఫలితంగా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. రానున్నరోజుల్లో ప్రభుత్వం విద్యను మరింత బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

అవార్డుకు ఎంపికైన ప్రభుత్వ ఉపాధ్యాయుడు


శ్రీనివాస్

గంగాధర, మే 1 (ఆంధ్రజ్యోతి): గంగాధర ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు మియాపురం శ్రీనివాస్ డాక్టరేట్‌కు ఎంపికయ్యాడు. రవీంద్రనాథ్‌ఠాగూర్ జయంతిని పురస్కరించుకుని ప్రతిసంవత్సరం వివిధ రంగాల్లో కృషి చేస్తున్నవారికి తెలుగు సంస్కృతీ సాహితీసేవా ట్రస్ట్, మాచారం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హానరీ డాక్టరేట్ అవార్డును అందిస్తున్నారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయుడిగా, కవి, రచయిత, సామాజిక వేత్త, చిత్రకారుడిగా విశిష్ట కృషి చేసినందుకు అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆ సంస్థ చైర్మన్ గౌరీశంకర్ తెలిపారు. ఈనెల4న హైదరాబాద్‌లోని త్యాగరాయ సభ చిక్కడపల్లిలో ప్రముఖులతో సన్మానం, అవార్డును అందించనున్నారు.

గ్రంథాలయానికి గ్రిల్స్ ఏర్పాటు

హుజూరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని గ్రంథాలయానికి రూ.30వేల విలువచేసే ఇనుప గ్రిల్స్‌ను సామాజిక కార్యకర్త, సేవ్ ద ట్రీస్ గౌరవ అధ్యక్షుడు వర్ధినేని రవీందర్‌రావు గురువారం అందజేశారు. కోతులు చొరబడి పుస్తకాలను ధ్వంసం చేస్తుండడంతో ఈ విషయాన్ని స్థానికటౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ రవీందర్‌రావు దృష్టికి తీసుకుపోగా, స్పందించిన ఆయన గ్రిల్స్‌ను ఏర్పాటు చేయించారు.

దేశవ్యాప్తంగా కుల గణనపై బీజేపీ హర్షం


ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

గణేశ్‌నగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జనాభా లెక్కలతోపాటు కులగణన చేపట్టాలని ప్రధాని మోదీ, కేంద్రక్యాబినెట్ తీసుకున్న నిర్ణయంపై జిల్లా బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణచౌక్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకంచేశారు.ఈ సందర్భంగా బీజేపీ జిల్లాఅధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా జనాభా లెక్కలతోపాటు కులగణన చేపట్టడం చారిత్రక నిర్ణయమన్నారు. మాజీమేయర్ సునీల్‌రావు, బీజేపీజిల్లా ప్రధానకార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ వాసాలరమేష్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దూలం కళ్యాణ్, మాజీకార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: బీసీసంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, సంఘం జిల్లాప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, కేంద్రం హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చిత్రపటాలకు తెలంగాణ చౌక్‌లో క్షీరాభిషేకం చేశారు.

- బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, బీసీ మహిళా సంక్షేమ సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షురాలు గన్నాంబ పాల్గొన్నారు.

కేంద్రప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం..

చిగురుమామిడి: జనాభా లెక్కల్లో కులగణన కూడా చేపట్టాలని కేంద్ర కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని మాజీజడ్పీటీసీ సభ్యుడు గీకురు రవీందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కుల గణనకు తెలంగాణ ప్రభుత్వమే మోడల్ అన్నారు. కేంద్రప్రభుత్వం కులగణనపై నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషం అని అన్నారు. కుల గణనకు నిర్దిష్ట కాలపరిమితి ఉండాలని అన్నారు. అందుకు గాను తగిన బడ్జెట్ కేటాయించి కేంద్రం ముందుకు వెళ్లాలని అన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమసంఘం మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్‌కుమార్, బుర్రశ్రీనివాస్, నాయకులు పెసరు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు

శంకరపట్నం, మే 1 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం తహసీల్దార్‌గా రమేష్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడవిధులు నిర్వహిస్తున్న భాస్కర్ హుజూరాబాద్ ఆర్డీవో కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

తిమ్మాపూర్: తిమ్మాపూర్ మండల తహసీల్దార్‌గా శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. తిమ్మాపూర్ తహసీల్దార్‌గా విజయ్‌కుమార్ మానకొండూర్ మండలానికి బదిలీఅయ్యారు.

మానకొండూరు: మానకొండూరు తహసీల్దారుగా విజయ్‌కుమార్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ విధులను నిర్వహించిన తహసీల్దారు రాజేశ్వరి రామడుగుకు బదిలీ అయ్యారు.

వివేకానందలో సయోనారా 2కే25

గణేశ్‌నగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ,పీజీ కళాశాలలో డిపార్ట్మెంట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ అండ్ ఫిజికల్ సైన్స్ ఆధ్వర్యంలో సయోనారా 2కే25 పేరిట గురువారం వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌యూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ఏసీవో బి.సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కరీంనగర్‌రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం జూబ్లీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2007-08 సంవత్సరం పదోతరగతి విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

విద్యార్థినులకు నగదు పురస్కారం అందజేత


విద్యార్థినులకు నగదు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దంపతులు

తిమ్మాపూర్/మానకొండూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కవ్వంపల్లి అనురాధ దంపతులు ఘనంగా సత్కరించారు. గురువారం సాయంత్రం క్యాంపు కార్యాలయానికి ఎమ్మెల్యేను కలి సేందుకు వచ్చిన విద్యార్థినులను ఎమ్మెల్యే దంపతులు సత్కరించి స్వీట్లు తినిపించారు. అత్యధిక మార్కులు సాధించిన ఎస్.చందన(580), ఈ.సుప్రీయ(571), ఎ.అలేఖ్య(568), ఈ.హర్షిత(566), కె.మాన్విత(563) విద్యార్థులు ఒకొక్కరికి 5వేల రూపాయల చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏకాగ్రత, పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని అన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఆర్సీవో ఎం అంజలి, ప్రిన్సిపాల్ జె.లావణ్య, ఉపాధ్యాయులు సునీత, మమత, ఉమామహేశ్వరి, కృష్ణవేణి, లావణ్య పాల్గొన్నారు.

పేదలకు ప్రభుత్వం అండ

కరీంనగర్ అర్బన్, మే 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని, వివిధ కారణాలతో అనారోగ్యానికి గురై ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారిని సీఎమ్మార్‌ఎఫ్‌తో ఆదుకుంటామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర కాంగ్రెస్ కార్యాలయంలో గతంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధితోపాటు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు గుండాటి శ్రీనివాస్ రెడ్డి, అస్తపురం రమేష్ పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్ : కరీంనగర్ మండలంలో దుర్శేడ్‌లో గురువారం దుర్శేడ్‌కు చెందిన లబ్ధిదారులకు కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బుర్ర హరీష్‌గౌడ్ సీఎమ్మార్‌ఎఫ్ చెక్కులు అందజేశారు.

పన్ను రాయితీ గడువు పొడిగింపు

హుజూరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మున్సిపాలిటీ 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆస్తిపన్ను చెల్లించడానికి 5 శాతం రాయితీని ఈనెల 7వరకు ప్రభుత్వం పొడిగించినట్లు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య గురువారం తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కబడ్డీ శిక్షణ శిబిరం ప్రారంభం

హుజూరాబాద్‌రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి క్రీడల శిక్షణ శిబిరం డీవైఎస్‌వో శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభమైంది. జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు సారయ్య క్రీడలను ప్రారంభించారు. కబడ్డీ సెక్రెటరీ శ్రీనివాస్, జిల్లా జాయింట్ సెక్రెటరీ అంజయ్య, రవికుమార్, పీఈటీ భాగ్యలక్ష్మీ, క్యాంపు నిర్వాహకులు ఉన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిగా కట్ట కీర్తన


కీర్తన

భగత్‌నగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆరెపల్లికి చెందిన కట్ట కీర్తన జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. పెద్దపల్లిలోని టీజీఎస్ డబ్ల్యూఎస్ జూనియర్ కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న కట్ట కోటి-పద్మ దంపతుల కూమార్తె కీర్తన. గౌతమ్ మోడల్‌స్కూల్‌లో పదోతరగతి, అల్ఫోర్స్ జూనియర్‌కళాశాలలో ఇంటర్, పడాల రామ్‌రెడ్డి కళాశాలలో ఎల్‌ఎల్‌బీ, హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీలో ఎల్ఎల్ఎం చదివారు. జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికకావడంపై కీర్తనను పలువురు అభినందించారు.

నేడు శంకరాచార్య, రామానుజాచార్య జయంతి

కరీంనగర్ కల్చరల్, మే 1: ఆదిశంకరులు, రామానుజుల జయంతిని శుక్రవారం నగరంలోని పలు దేవాలయాల్లో నిర్వహించనున్నారు. ప్రధాన శైవాలయాలతోపాటు గణేశశారదా శంకరాలయంలో అఖిల బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో శంకర జయంతిని నిర్వహించనున్నారు. అన్ని వైష్ణవాలయాలతోపాటు వేదభవనం, ఆండాళ్ భవనంలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో రామానుజ జయంతిని నిర్వహించనున్నారు.